క్లుప్తంగా

నారాయణతే నమో..నమో..



కూచిపూడి నృత్యంతో అలరిస్తున్న కళాకారులు

చంద్రగిరి: తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. వారాంతపు కార్యక్రమంలో భాగంగా ఆదివారం విశాఖపట్నంకు చెందిన ఉషారాణి, మయూరి నృత్యనికేతన్ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్యం ఆద్యంతం ఆకట్టుకుంది. గజాననయుతం అంటూ సాగిన పాటతో మొదలై బ్రహ్మాంజలి, అదివో అల్లదివో, జగవధన, శ్రీమన్నారాయణ, జాతీశ్వరం, తరంగం, గణేషకవుతువం, రామాయణ శబ్దం, నారాయణ గోవింద హరి, గరుడ గమన రారా వంటి పాటలకు కళాకారులు చూడచక్కని హావభావాలతో నాట్య ప్రదర్శన చేశారు. వారి అభినయానికి మంత్రముగ్ధులైన ప్రేక్షకులు కరతాళ ధ్వనులతో అభినందనలు తెలిపారు. అనంతరం ఏఓ సుధాకర్ కళాకారులను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.

ఎంప్లాయీస్ అసోసియేషన్ ఎన్నిక



కొత్త కమిటీతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎన్నికల అధికారి సురేష్‌బాబు

తిరుపతి అర్బన్: ఉమ్మడి చిత్తూరు జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ ఎన్నిక ఆదివారం తిరుపతి ఎన్జీఓ హోంలో ఎలక్షన్ ఆఫీసర్ సురేష్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. నామినేషన్ల స్వీకరణ చేపట్టగా.. అన్ని పోస్టులకు ఒక్కో నామినేషనే దాఖలు అయ్యాయి. దీంతో ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా ఏ.శ్రీనివాసులు, తిరుపతి కార్యదర్శిగా సెబాస్టియన్, చిత్తూరు వైస్ ప్రెసిడెంట్‌గా శివసాయి, జాయింట్ సెక్రటరీగా జయరామయ్య, మహిళ జాయింట్ సెక్రటరీగా రమణమ్మ, కోశాధికారిగా మునిచంద్ర, ఆర్గనైజింగ్ సెక్రటరీగా చంద్రమౌళి, ఈసీ మెంబర్లుగా ప్రసాద్, చంద్రశేఖర్ ఎన్నికైనట్లు ప్రకటించారు. అనంతరం వారి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ ఎన్నికలకు సహ ఎన్నికల అధికారిగా ఎం.శ్రీనివాసులు వ్యవహరించారు.

ఆ కళాశాలలపై చర్యలు తీసుకోండి

తిరుపతి సిటీ: ప్రభుత్వ నియమ నిబంధనలను, ఫీజుల నియంత్రణ చట్టాలను పూర్తిగా ఉల్లంఘిస్తూ, తిరుపతిలోని పలు ఇంజినీరింగ్ కళాశాలలు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నాయని అఖిల ఎస్ఎఫ్ఐ జాతీయ కార్యదర్శి శివారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ముందస్తు అడ్మిషన్ల పేరుతో భారీ డొనేషన్లు వసూలు చేయడంతో పాటు, ఫీజు నియంత్రణ కమిటీ నిర్ధారించిన ఫీజుల కంటే అధిక మొత్తాన్ని వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇందులో ప్రధానంగా కరకంబాడి రోడ్డులోని ఓ ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం ఆంధ్రప్రదేశ్ అడ్మిషన్ ప్రొహిబిషన్ ఆఫ్ క్యాపిటేషన్ ఫీజు చట్టాన్ని, ఫీజు నియంత్రణ చట్టాలను బహిరంగంగా ఉల్లంఘిస్తోందని ఆరోపించారు. ఉన్నతాధికారులు తక్షణం తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

హామీలు అమలు చేయని కూటమి ప్రభుత్వం



మాట్లాడుతున్న ఎస్‌యూసీఐ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర నేత ప్రమీల

తిరుపతి కల్చరల్: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను దగా చేస్తోందని ఎస్‌యూసీఐ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యురాలు సీహెచ్ ప్రమీల విమర్శించారు. సోషలిస్టు యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా పార్టీ ఆధ్వర్యంలో యూత్‌హాస్టల్లో ఆదివారం ప్రజా సమస్యలపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా అరకొర పథకాలు అమలు చేసి ప్రజలను మోసం చేస్తోందని ధ్వజమెత్తారు. ఎస్‌యూసీఐ నగర ఇన్‌చార్జ్ హరీష్ మాట్లాడుతూ రుయా, స్విమ్స్ హాస్పిటళ్లలో శాశ్వత ప్రాతిపదికన పోస్టులు భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎంఎస్ఎస్ మహిళా సంఘ నేత లక్ష్మి, ఏపీ యునైటెడ్ స్కూల్ వర్కర్స్ యూనియన్ నేత వెంకటసుబ్బయ్య, ఏఐడీఎస్ఓ విద్యార్థి సంఘ నేత నవీన్‌కుమార్, ఎస్‌యూసీఐ నేతలు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ నారాయణగిరి షెడ్ల వద్దకు చేరుకుంది. శనివారం అర్ధరాత్రి వరకు 90,051 మంది స్వామివారిని దర్శించుకోగా 39,058 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.2.90 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 15 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం పూర్తవుతోంది.

ఆగని ఆక్రమణలు

మంగళంలోని తిరుమలనగర్ పంచాయతీలో ఆక్రమణలు ఆగడం లేదు. మంగళం చెన్నాయగుంట లెక్కదాఖలా సర్వే నంబర్ 195లో గత రెండురోజుల కిందట టీడీపీ నాయకులు ఆక్రమణలకు పాల్పడ్డారు. దీంతో రెవెన్యూ అధికారులు అడ్డుకుని ఆక్రమణదారులను హెచ్చరించి పంపేశారు. అయితే ఆదివారం మరికొందరు ఆక్రమణదారులు అదే స్థలంలో రాత్రికి రాత్రే అక్రమ నిర్మాణాలు చేపట్టారు. విషయం తెలుసుకున్న అర్బన్ తహసీల్దార్ సురేష్‌బాబు ఆదేశాల మేరకు వీఆర్‌ఓలు ప్రసాద్, స తీష్ సంఘటనా స్థలానికి చేరుకుని పంచాయతీ సి బ్బంది సహకారంతో ఆక్రమణలను తొలగించారు. క ట్టడాలను పెద్దపెద్ద ఇనుప సమెట్లతో ధ్వంసం చేశా రు. ప్రభుత్వ భూమిని ఆక్రమించాలని ఎవరైనా చూ స్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. 19 5 సర్వేనంబర్‌కు సంబంధించి ఏవైనా పత్రాలు ఉంటే తహసీల్దార్‌కు చూపించి ఆపై నిర్మాణాలు చేసుకోవాలని, అలా కాకుండా ఇష్టానుసారం కట్టడాలు చేపడితే కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. – తిరుపతి మంగళం



నిర్లక్ష్యం.. నీటికి కష్టం



తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్లపల్లి వాసులకు తాగునీటి కష్టాలు తీరడం లేదు. గత రెండు రోజులుగా నీటి కోసం గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. చెర్లోపల్లి నుంచి శ్రీనివాసమంగాపురం వరకు జరుగుతున్న రహదారి విస్తరణ పనుల్లో భాగంగా పెరుమాళ్లపల్లి పంచాయతీకి వస్తున్న నీటి పైపులైన్లను ధ్వంసం చేశారు. దీంతో బోరు బావుల నుంచి గ్రామానికి సరఫరా అయ్యే నీరు నిలిచిపోయింది. గ్రామ పంచాయతీ సర్పంచ్ జోగి మోహన్, ఉప సర్పంచ్ వెంకటనారాయణ స్పందించి పైపులైన్ల మరమ్మతు పనులు ప్రారంభం చేసినప్పటికీ పూర్తిస్థాయిలో నీటిని అందించేలేని పరిస్థితి నెలకొంది. మరో రెండు రోజుల పాటు పంచాయతీ ప్రజలకు నీటి కష్టాలు తప్పేలా లేవు. ఇప్పటికే గ్రామస్తులు నీటిని పొదుపుగా వాడుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో నీటి ట్యాంకర్లను తెచ్చుకోవాలని పంచాయతీ సిబ్బంది తెలియపరిచారు. కాగా రోడ్డు విస్తరణ పనులు చేస్తున్న సిబ్బంది నిర్లక్ష్యం, పంచాయతీ పెద్దలకు ముందస్తు సమాచారం లేకుండా తవ్వేయడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. – తిరుపతి రూరల్

నోటీస్ బోర్డు

- తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక, 10.30 నుంచి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం
- తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్విమ్స్ వద్ద ఉదయం 10 గంటలకు స్విమ్స్ కార్మికుల రిలే నిరాహారదీక్షలు
- సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య నగర్‌లో డ్రైనేజీ, రోడ్ల అధ్వాన్న పరిస్థితులపై రైల్వే కాలనీ మెయిన్ రోడ్డులో ఉదయం 10.30 గంటలకు ధర్నా
- శ్రీవారి సాక్షాత్కార వైభవోత్సవాల్లో భాగంగా మంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం 11 నుంచి 12 గంటల వరకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 5 గంటలకు ఊంజల్ సేవ, రాత్రి 7 గంటలకు పెద్దశేషు వాహన సేవ
- తెలుగు సాహితీ సమితి ఆధ్వర్యంలో మహిళా వర్సిటీలోని తెలుగు అధ్యయన శాఖ కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు ×కథా సాహిత్యం– గ్రామీణ జీవితం≀ అనే అంశంపై సదస్సు
- శ్రీహథీరాం బావాజీ మహా సంఘ్ ఆధ్వర్యంలో తిరుమల హథీరాంజీ మఠంలో భావాజీ 596వ జయంతి వేడుకల్లో భాగంగా రెండవ రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు భోగ్ పూజలు, జాతీయ సమావేశం
- తిరుపతిలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న శ్రీనివాసం, రైల్వేస్టేషన్ వద్దనున్న విష్ణు నివాసం, అలిపిరి వద్దనున్న భూదేవి కాంప్లెక్‌లో తిరుమలకు శ్రీవారి మెట్లు నడక మార్గంలో వెళ్లే భక్తులకు సాయంత్రం 3.30 గంటల నుంచి శ్రీవారి ఉచిత దర్శనం టోకెన్లు పంపిణీ

చెవిరెడ్డి కుటుంబానికి మంచి జరగాలని..

- ఆలయాల్లో వైఎస్సార్‌సీపీ నేతల పూజలు
- అనాథ ఆశ్రమాల్లో అన్నదానం



అక్షయక్షేత్రంలోని అనాథపిల్లలకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేస్తున్న వైఎస్‌ఆర్‌సీపీ విద్యార్థి విభాగం నేతలు

తిరుపతి రూరల్ : చంద్రగిరి నియోజకవర్గం వైఎస్ఆర్‌సీపీ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం నిరాడంబరంగా జరిగాయి. సంబరాలు వద్దని చెప్పినా.. ఆయన అభిమానులు, పార్టీ నేతలు మాత్రం చెవిరెడ్డి కుటుంబానికి, మోహిత్‌రెడ్డికి అంతా మంచే జరగాలని కోరుతూ ఆలయాల్లో పూజలు చేశారు. తిరుపతి రూరల్ మండలం గాంధీపురం పరిధిలోని పాస్ మనోవికాస కేంద్రంలోని బుద్ధిమాంద్యం పిల్లలకు సర్పంచ్ లక్ష్మి, ఆమె భర్త మస్నూరు శివ, ముని, స్థానిక నేతలు అన్నదానం నిర్వహించారు. అలాగే దుర్గసముద్రం సమీపంలోని అక్షయ క్షేత్రంలో వైఎస్సార్ వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఓబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ వేడుకలు చేపట్టారు. కార్యక్రమంలో వైయస్సార్ విద్యార్థి, యువజన సంఘాల నాయకులు చెంగల్ రెడ్డి, యశ్వంత్ రెడ్డి, రఫీ, శేషారెడ్డి, నవీన్ కుమార్ రెడ్డి, పార్థసారథి, వెంకటరమణ నాయక్, మోహన్ రెడ్డి, వేంకటేశ్వర్లు, నాగరాజు రెడ్డి, మహేంద్ర, జగన్, చరణ్, ఓం ప్రకాష్, భూపాల్, గిరి, ముబారక్ తదితరులు పాల్గొన్నారు. అలాగే రామచంద్రాపురం మండలం సి.రామాపురం పంచాయతీ సర్పంచ్ పవన్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పార్టీ నేతలు, కార్యకర్తలు రక్తదానం చేశారు.



రామచంద్రాపురం మండలం సి.రామాపురంలో రక్తదానం

వృద్ధులకు అన్నదానం

చంద్రగిరి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా మండల పరిధిలోని నాగయ్యగారిపల్లి సమీపంలోని అరుణోదయ వృద్ధాశ్రమంలో పిల్లల ఆదరణకు దూరమైన సుమారు 40 మంది వృద్ధులకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో వారికి అన్నదానం చేశారు. ఆయన మాట్లాడుతూ తమ నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని అక్రమ అరెస్టు చేయడంతో, యువనేత చెవిరెడ్డి మోహిత్ రెడ్డి జన్మదిన వేడుకలకు పార్టీ దూరంగా ఉండటం జరిగిందన్నారు. కార్యక్రమంలో చంద్రగిరి ఎంపటీసీ బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి, కొత్తపాటి కోటి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు అజయ్, విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడు వినోద్, నవీన్, అంగేరి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నగొట్టిగల్లులో ప్రత్యేక పూజలు

చినిగేపల్లి గంగమ్మ ఆలయంలో చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా చిన్నగొట్టిగల్లు మండల అధ్యక్షుడు సింహాల మోహన్, పార్టీ నేతలతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు.



చంద్రగిరి: అరుణోదయ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం

నూతన కార్యవర్గం ఎన్నిక

పాకాల : వచ్చే లయనిస్టిక్ ఇయర్‌కు లయన్స్ క్లబ్ ఆఫ్ పాకాలకు నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసినట్లు డిస్ట్రిక్ట్ 317 ఈస్ట్ జోన్ చైర్‌పర్సన్ మారసాని విజయబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ నూతన కార్యవర్గంలో ప్రెసిడెంట్ పోతుగుంట అనిల్, సెక్రటరీగా మహేష్‌బాబు, ట్రెజరర్ మారసాని నాగేంద్రను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు.

నివాళి



సూరా నరహరి మృతికి నివాళులర్పిస్తున్న భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : తిరుమల ఎన్‌టీవీ సీనియర్ కరస్పాండెంట్ సూరా మోహన్‌ప్రసాద్, తిరుమల ఏబీఎన్ రిపోర్టర్ జితేంద్రకుమార్ తండ్రి నరహరి ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి తిరుపతి ఉపాధ్యాయనగర్‌లోని వారి నివాసానికి వెళ్లి సూరా నరహరి భౌతికకాయానికి గజమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పరామర్శ...

వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు పద్మజ తల్లి విజయలక్ష్మి మృతికి భూమన కరుణాకరరెడ్డి , తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి నివాళులర్పించారు. అనంతరం విజయలక్ష్మి కుటుంబ సభ్యులను వారు పరామర్శించారు. అలాగే భూమన అభినయ్ స్నేహితుడు సోడిశెట్టి నరేష్ శుభస్వీకరణ సందర్భంగా నరేష్ చిత్రపటానికి వారు నివాళులర్పించారు.





విజయలక్ష్మి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న అభినయ్‌రెడ్డి, స్నేహితుడు నరేష్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అభినయ్‌రెడ్డి

ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లపై నిర్లక్ష్యం తగదు

పాకాల : రాష్ట్ర ప్రభుత్వానికి ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల పట్ల నిర్లక్ష్య వైఖరి తగదని బీటీఏ నాయకులు విమర్శించారు. ఆదివారం స్థానిక ఎన్‌వీఎన్ పాఠశాలలో బీటీఏ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని మండల అధ్యక్షుడు జ్యోతిప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన బీటీఏ జాతీయ ఉపాధ్యక్షుడు ఆంజినేయులు, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు రామచంద్ర, రామ్మూర్తి మాట్లాడుతూ మార్చి 2020 నుంచి రావలసిన 11వ పీఆర్సీ బకాయిలు, డీఏ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 13 నెలలు కావొస్తున్నా ఒకటి కూడా నెరవేర్చకపోవడం బాధాకరమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం పీఆర్సీ, డీఏ బకాయిలతో పాటు ఐఆర్ 30 శాతాన్ని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీటీఏ నాయకులు పాల్గొన్నారు.

వేడుకగా హథీరాం బావాజీ జయంతి



జయంతి వేడుకల్లో వివిధ రాష్ట్రాల సాధుసంతులు, మహంతులు, బంజార సంఘ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: హథీరాం బావాజీ మహాసంఘ్ ఆధ్వర్యంలో ఆదివారం హథీరాంజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గాంధీ రోడ్డులోని హథీరాం మఠంలో బంజారా సంప్రదాయ పండుగగా బోగ్ బండార్, హోమాలు, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన మహారాష్ట్ర పొరా దేవి సేవాలాల్ వంశస్తులు జితేంద్ర మహారాజ్, కర్ణాటక నుంచి సర్దార్ సింగ్ మహారాజ్, మంజు మహారాజ్ రమేష్ గిరి పాల్గొని ప్రసంగించారు. హథీరాం బావాజీ సేవాభావంతో నడవాలని ఆయన మాలధారణ వచ్చే శ్రావణ మాసంలో ప్రతి బంజారా ఇంట్లో ధరించడంతో పాటు ప్రతి ఒక్కరూ బోగ్ బండార్ వేషధారణ మర్చిపోకూడదని తెలిపారు. మన సాంస్కృతిక సాంప్రదాయాలను మనం కాపాడుకోవాలని, సనాతన ధర్మంలో బంజారాలను గుర్తించేలా టీటీడీ బోర్డులో సభ్యులుగా నియమించాలని డిమాండ్ చేశారు. అలాగే బంజారాలకు ఒక కమిటీ ఏర్పాటు చేసి చైర్మన్ ట్రస్ట్‌గా నియమించాలని, తద్వారా మఠాన్ని అభివృద్ధి బాటలో నడిపించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మహారాజ్ ఎస్ఎస్.కృష్ణ, రాజేంద్రప్రసాద్, బంజారా సంఘ నేతలు, ఆరు రాష్ట్రాల నుంచి వందలాది మంది సాధుసంతులు, మహంతులు, హథీరాం బావాజీ మాలధారులు పాల్గొన్నారు.

బతుకు బండి..

ఆధ్యాత్మిక నగరానికి పొట్ట కూటి కోసం ఇతర రాష్ట్రాల నుంచి వివిధ పనుల మీద, వ్యాపార నిమిత్తం ఎంతోమంది వర్తకులు వస్తుంటారు. ఈ నేపథ్యంలో రాజస్థాన్ నుంచి బతుకు జీవనం కోసం వచ్చిన ఓ కుటుంబం ఇలా తమ వాహనంలో వారు సొంతంగా తయారు చేసిన వివిధ వస్తువులను అమ్ముతూ మరోవైపు ఆ వాహనం పైనే వారు నివసించేందుకు గూడును ఏర్పాటు చేసుకున్నారు. వారు సేద తీరుతున్న దృశ్యాలను ఆదివారం సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.



– సాక్షి ఫోటోగ్రాఫర్ తిరుపతి

క్రమశిక్షణ కలిగిన ఉద్యోగి డీఆర్ నాయుడు



ఉద్యోగ విరమణ సందర్భంగా డీఆర్ నాయుడును సన్మానిస్తున్న ఆర్టీసీ అధికారులు

తిరుపతి అర్బన్: తిరుపతి సెంట్రల్ బస్టాండ్ పరిధిలో పనిచేస్తున్న అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్(ఏటీఎం)డీఆర్ నాయుడు సేవలు అభినందనీయమని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ)తిమ్మాడి చెంగల్‌రెడ్డి తెలిపారు. లీలామహల్ సర్కిల్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఆయన ఉద్యోగ విరమణ సందర్భంగా సన్మాన కార్యక్రమం చేపట్టారు. అయితే విజయవాడ నుంచి వచ్చిన ఈడీ చెంగల్‌రెడ్డి మాట్లాడుతూ తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో పారిశుద్ధ్య చర్యలు, తాగునీటి సమస్యల పరిష్కారంతో పాటు ఖాళీ దుకాణాలను ఎప్పటికప్పుడు భర్తీ చేయడంలో డీఆర్ నాయుడు చూపిన చొరవ అభినందనీయమన్నారు. ఓ క్రమశిక్షణ కలిగిన ఉద్యోగి అని కొనియాడారు. ఏ బాధ్యత అప్పగించినా సమర్థవంతంగా నిర్వహించే ఉద్యోగిగా గుర్తింపు తెచ్చుకున్నారని అన్నారు. 34 ఏళ్లపాటు ఆర్టీసీలో వివిధ హోదాల్లో, తిరుపతి ఏటీఎంగా నాలుగేళ్లపాటు డీఆర్‌నాయుడు సేవలు అందించారని వివరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి జగదీష్, డిప్యూటీ చీఫ్ మెకానిక్ ఇంజినీర్ బాలాజీ, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ విశ్వనాథం, మంగళం డీఎం భాస్కరయ్య, శ్రీకాళహస్తి డీఎం మునిచంద్ర, ఆర్టీసీ ఉద్యోగ సంఘం నేతలు అర్జునయ్య, వీఆర్ కుమార్, వేణు తదితరులు సన్మాన సభలో పాల్గొన్నారు.

పలకరింపులు.. పరామర్శలు



సర్పంచ్ సుభాషిణి మరణంతో ఆమె భర్త శుభగిరి నాయుడును పరామర్శిస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి



రెడ్డెప్పరెడ్డిని పరామర్శిస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం చెర్లోపల్లి పంచాయతీ సర్పంచ్ బొల్లినేని సుభాషిణి మృతి పట్ల వైఎస్సార్‌సీపీ ఉమ్మడి జిల్లాల విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి ఆదివారం విచారం వ్యక్తం చేశారు. వారి ఇంటికి చేరుకుని సుభాషిణి చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె భర్త బొల్లినేని శుభగిరి నాయుడిని పరామర్శించారు. అలాగే సి.మల్లవరంలోని కలికిరి శేఖర్ రెడ్డి కర్మక్రియలకు హాజరై కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఆయన వెంట తిరుపతి రూరల్ మండలం ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, రాష్ట్ర పార్టీ నాయకులు ఉపేంద్రరెడ్డి, జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు చిన్నియాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు మునీశ్వరరెడ్డి, సి.మల్లవరం సర్పంచ్ మొక్కల భారతి, గోపి, మురళి, హరిప్రసాద్‌రెడ్డి, రాజేష్ ఉన్నారు.

రెడ్డెప్పరెడ్డికి పరామర్శ

పాకాల : గాదంకి పంచాయతీ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ రెడ్డెప్పరెడ్డిని ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు.

రమాదేవిలో ఉచిత మెగా వైద్యశిబిరం రేపు

తిరుపతి తుడా: స్థానిక రమాదేవి ఆస్పత్రిలో జూలై ఒకటో తేదీ మంగళవారం డాక్టర్స్ డేని పురస్కరించుకుని ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు డైరెక్టర్ డాక్టర్ డీబీ శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో ఎముకలు, కీళ్లు, నరాలు, వెన్నెముక, చెవి, ముక్కు, గొంతు, థైరాయిడ్, ఫైల్స్, ఊపిరితిత్తులు, హెర్నియా, వరిబీజం, కిడ్నీ సమస్యలు, యాక్సిడెంట్ కేసులు, మోకాలి ఆపరేషన్లు వంటివాటిలో నిపుణులైన డాక్టర్లచే పరీక్షలు, ఉచిత ఆపరేషన్లు చేయనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని ఈహెచ్ఎస్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పోలీస్, విద్యుత్ ఉద్యోగులు, ఈఎస్ఐ లబ్ధిదారులు, రైల్వే, మాజీ సైనికులు, విశ్రాంత ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

2న ఉచిత మెగా జాబ్‌మేళా

తిరుపతి కల్చరల్: ఆర్యవైశ్య సంఘం, పేటీఎం, జిప్టో, రెప్యూటెడ్ రిటైల్ కంపెనీ సంయుక్త ఆధ్వర్యంలో కొత్తవీధిలోని ఆర్యవైశ్య సంఘం కార్యాలయంలో జూలై 2వ తేదీన ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉచిత మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దిండుకుర్తి నరసింహులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు, ఆపై తరగతుల వారు ఈ మేళాలో పాల్గొనవచ్చన్నారు. తిరుపతితో పాటు చంద్రగిరి, రేణిగుంట, శ్రీకాళహస్తి ప్రాంతాల వారికి ప్రాధాన్యత కల్పించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9154695289, 9848647123 నంబర్లలో సంప్రదించాలని తెలియజేశారు.